వ్యాన్-ఆటో ఢీ

- గండేపల్లి మండలం జెడ్.రాగంపేటలో హైవేపై చెల్లాచెదురుగా పడిన రేషన్ బియ్యం బస్తాలు
- అక్రమ రవాణా గుర్తించిన అధికారులు
- కేసు నమోదు

- 7లో

శంభో.. శివ శంభో.. శివ.. శివ శంభో



పిఠాపురం పాదగయ క్షేత్రంలోని పుష్కరిణిలో మహాశివరాత్రి సందర్భంగా స్నానాలు చేస్తూ ఆలయానికి పోటెత్తిన భక్తులు


శంభో.. శివ శంభో... అంటూ శివాలయాలు శివనామసర్మణతో మారుమోగాయి. మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని ప్రముఖ ఆలయాలైన పిఠాపురం పాదగయ క్షేత్రం, సామర్లకోట భీమేశ్వరాలయంతోపాటు ఇతర ప్రాంతాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల వద్ద పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. - 7, 8 లో





సామర్లకోట భీమేశ్వరాలయ ప్రాంగణంలో మహాశివరాత్రి సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు.. ప్రత్యేక అలంకారంలో భీమేశ్వరస్వామి

పరిగెత్తి.. పనిచేయండి



- జిల్లాలో నియోజకవర్గాల్లో సమస్యలు, విభేదాల పరిష్కారంపై టీడీపీ దృష్టి
- పిఠాపురం నియోజకవర్గ పరిణామాలపై ఆరా తీసిన చంద్రబాబు
- మాజీ ఎమ్మెల్యే వర్మతో ఫోన్‌లో మాట్లాడిన టీడీపీ అధినేత
- నియోజకవర్గంలో ఎన్నికల పనిలో వేగం పెంచాలని ఆదేశం
- త్వరలో సానుకూల నిర్ణయం ఉంటుందని వివరించిన చంద్రబాబు
- కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి సత్తిబాబుతోను మాట్లాడిన బాబు
- అసంతృప్తి వీడి ఉమ్మడి అభ్యర్థి విజయానికి పనిచేయాలని సూచన
- కాకినాడ సిటీ, పిఠాపురం నియోజకవర్గాలపై త్వరలో రానున్న స్పష్టత

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డ నేపథ్యంలో జిల్లాలో ఒక్కో సీటుపై టీడీపీ అధినేత స్పష్టత ఇస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో తుని, జగ్గంపేట, పెద్దాపురం సీట్లకు అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ మిగిలిన సీట్లపైనా కసరత్తు దాదాపు పూర్తి చేసింది. పిఠాపురం సీటు విషయంలో కొంత కాలంగా గందరగోళం నెలకొంది. ఈసీటు జనసేనకు ఇస్తారని, పవన్ కళ్యాణ్ పోటీ చేస్తారని బలంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం పిఠాపురంలో టీడీపీ కీలక నేతలు సమావేశం ఏర్పాటు చేసి వర్మకు టికెట్ ఇవ్వాలని నినాదాలు చేశారు. కొందరు కార్యకర్తలు కరపత్రాలను దహనం చేశారు. ఈ నేపథ్యంలో పిఠాపురం నియోజకవర్గ పరిణామాలపై టీడీపీ అధిష్ఠానం ఆరా తీసింది. ఇందులో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వర్మతో ఢిల్లీనుంచి ఫోన్‌లో మాట్లాడారు. గురువారం చోటుచేసుకున్న పరిణామాలను అడిగి తెలుసుకున్నారు. దీనిపై చంద్రబాబుతో వర్మ మాట్లాడుతూ క్యాడర్ తమ మనోభిప్రాయాలు ఎందుకు వెల్లడించారనే దానిపై వివరించారు. దీనికి చంద్రబాబు స్పందిస్తూ క్యాడర్ రోడ్డెక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు ఇంకా కొద్దిరోజుల్లోనే ఉన్న నేపథ్యంలో నియోజకవర్గంలో మరింత స్పీడు పెంచి పనిచేయాలని సూచించారు. తాను, తన కుటుంబం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం మొదలుపెట్టినట్లు తెలిపారు. పిఠాపురం సీటు గురించి జరుగుతున్న ప్రచారంపై వర్మ చంద్రబాబుకు వివరించారు. దీనికి చంద్రబాబు జవాబిస్తూ దీనికి సంబంధించి ఎలాంటి ఆందోళన అవసరం లేదని, ఒకటి రెండురోజుల్లో సానుకూల నిర్ణయం రావచ్చని తెలిపినట్లు వర్మ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు స్వయంగా ఫోన్ చేసి వర్మతో మాట్లాడిన నేపథ్యంలో క్యాడర్ కూడా శాంతించారు. మరోపక్క కొన్నిరోజులుగా సీటు జనసేనకు వెళ్తుందనే విషయమై బలంగా ప్రచారం జరుగుతున్నా అధిష్ఠానం పిలిచి మాట్లాడకపోవడంతో వర్మ అనుచరులు కొంత అసంతృప్తిగా ఉన్నారు. ఇదే విషయాన్ని వర్మను కలిసి వివరించారు. ఇప్పుడు అధినేత చంద్రబాబు స్వయంగా ఫోన్ చేయడంతో కొంత క్లారిటీ వచ్చిందనే అభిప్రాయంలో నేతలు ఉన్నారు.

సమన్వయం సాధించినట్లే..

కాకినాడ రూరల్ సీటును పొత్తులో భాగంగా టీడీపీ జనసేనకు కేటాయించిన సంగతి తెలిసింది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి సత్తిబాబుతో చంద్రబాబు మాట్లాడారు. పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. విభేదాలు లేకుండా కలిసి సమన్వయంగా పనిచేసి ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని సూచించారు. ఎలాంటి అలకలు, అసంతృప్తులు వద్దని వివరించారు. పైగా అంతలోనే శుక్రవారం మధ్యాహ్నం నాటికే పిల్లి సత్తిబాబును రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గాను, ఇక్కడినుంచి టికెట్ ఆశించి పార్టీకోసం పనిచేసిన కటకంశెట్టి బాబిని కో-కోఆర్డినేటర్‌గాను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీచేశారు. దీంతో టికెట్ జనసేనకు వెళ్లిపోయిందన్న అసంతృప్తిలో ఉన్న టీడీపీ ఆశావహులకు తాజా నియామకాలతో పార్టీలో ప్రాధాన్యం కల్పించినట్లయింది. కొన్ని రోజులుగా ఇక్కడ టీడీపీ, జనసేన కీలక నేతల మధ్య కొంత సమన్వయ సమస్య ఉన్నట్లు ప్రచారం జరిగింది. జనసేనకు టికెట్ కేటాయించిన నేపథ్యంలో సహకారం పూర్తిస్థాయిలో ఉంటుందా? అనే సందేహాలు పలువురిలో వ్యక్తమయ్యాయి. కానీ వాటన్నింటికీ పార్టీ ఫుల్‌స్టాప్ పెట్టినట్లయింది. అందులోభాగంగా మాజీ ఎమ్మెల్యే పిల్లి సత్తి బాబు, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ కలిసి గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి జరుగుతున్న వ్యతిరేక ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టారు. చంద్రబాబు కూడా సత్తిబాబుతో మాట్లాడడం, కటకంశెట్టి బాబీకి కోకోఆర్డినేటర్ పదవి ఇచ్చిన నేపథ్యంలో కాకినాడ రూరల్‌కు సంబంధించి లోపాలు, ఇతర సమన్వయ సమస్యలన్నీ పరిష్కారం అయినట్లేనని పార్టీ భావిస్తోంది. జిల్లాలో ఇంకా కాకినాడ సిటీ, ప్రత్తిపాడు సీట్లకు సంబంధించి అభ్యర్థుల ఎంపికపై చంద్రబాబు కసరత్తు పూర్తిచేసినట్లు చెబుతున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించి మార్పులేవీ ఉండవని సమాచారం. కాకినాడ సిటీకి సంబంధించి వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి బరిలో ఉన్న నేప థ్యంలో అంగ, ఆర్థిక బలం గట్టిగా ఉన్న ఇతడిని ఢీకొట్టే విషయంలో పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ద్వారంపూడిని బలంగా ఎదుర్కోగల నేతపై ఇప్పటికే దాదాపు కసరత్తు చేసినట్లు సమాచారం.

బోటు దహనం చేసి నిరసన

- మెయిన్‌లో

- సముద్రంలో ఫార్మా కంపెనీ పైప్‌లైన్లను తొలగించాలని మత్స్యకారుల డిమాండ్
- తక్షణం స్పందించకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని హెచ్చరిక
- కొత్తపల్లి మండలం కోనపాపపేటలో భారీస్థాయిలో మత్స్యకారుల ఆందోళన



సముద్రంలో వేసిన పైపులైన్లను తొలగించాలని కోనపాపపేటలో రోడ్డుపై బైఠాయించిన మత్స్యకారులు

సామాన్యులకు ఊరట

- గ్యాస్ సిలిండర్ ధర రూ.100 తగ్గించిన కేంద్రం
- నేటినుంచే అమల్లోకి.. ఇక రూ.831.50కే గ్యాస్



కార్పొరేషన్(కాకినాడ), మార్చి 8: ఔనండి.. గ్యాస్ ధర రూ.100 తగ్గింది. కేంద్రం గ్యాస్ ధరను వంద రూపాయలు తగ్గిస్తూ సామాన్యులకు శుభవార్త చెప్పింది. తగ్గించిన ధరలు శనివారంనుంచి అమల్లోకి రానున్నాయి. పెట్రోలియం, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరల్ని సవరించినా కొంతకాలంగా 19 కిలోల కమర్షియల్ సిలిండర్‌కు మాత్రమే తగ్గిస్తూ వచింది. గృహ వినియోగ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు ఉండేది కాదు. కమర్షియల్ సిలిండర్‌పై మాత్రమే గ్యాస్ రేట్లు తగ్గించడంతో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ వినియోగదారులు మరోవైపు నిరాశ చెందుతుండేవారు. ఎన్నికలు సమీపిస్తుండడం.. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం కావడంతో ప్రధాని మోదీ వంటింటి గ్యాస్ ధర రూ.100 తగ్గిస్తూ మహిళలకు శుభవార్త చెప్పారు. ఈ మేరకు ఆయా గ్యాస్ ఏజెన్సీలకు ధరలు తగ్గిస్తూ ఆదేశాలు అందాయి. జిల్లాలో 19 కిలోల గ్యాస్ సిలిండర్ రేటు ఆరు నెలలుగా నిలకడగా రూ.931.50గా ఉంది. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో రూ.100 తగ్గి రూ.831.50కే గ్యాస్ ధర సామాన్యులకు అందుబాటులోకి రావడంతో కాస్త ఊరట లభించింది. ఇంట్లో వినియోగించే గ్యాస్ సిలిండర్ రేటు తగ్గించడంపట్ల సామాన్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడలో ప్రత్యేక పోలీస్ బలగాల కవాతు



కాకినాడలో కవాతు నిర్వహిస్తున్న ప్రత్యేక పోలీస్ బలగాలు

కాకినాడ క్రైం, మార్చి 8: రానున్న సార్వత్రిక ఎన్నికల వేళ ప్రజలు తమ ఓటుహక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని పోలీస్, పారా మిలిటరీ బలగాలు భరోసా ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాకినాడ నగరంలో పోర్టు సీఐ సుమంత్ ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్‌కు చెందిన 100మంది ప్రత్యేక పారా మిలిటరీ బలగాలతో శుక్రవారం కవాతు నిర్వహించారు. పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలైన రాజీవ్‌గృహకల్ప, గణేష్ కాలనీ, దుమ్ములపేట, తారకరామనగర్ తదితర ప్రాంతాల్లో కవాతు నిర్వహించి ప్రజలకు ఓటుహక్కు వినియోగంపై మరింత అవగాహనతోపాటు ఎవరికీ భయపడకుండా ఓటు వేయాలని భరోసా కల్పించారు.

సమన్వయ లోపం.. సౌకర్యాలు కరవు

- పిఠాపురం పాదగయలో దేవదాయశాఖ అధికారుల తీరుపై భక్తుల ఆగ్రహం



పాదగయలో ఈవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్వరరావు

పిఠాపురం, మార్చి 8: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రానికి మహాశివరాత్రి సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో దేవదాయశాఖ అధికారులు విఫలమయ్యారు. అడుగడుగునా అసౌకర్యాలు, అధికారుల మధ్య సమన్వయ లోపం కనిపించింది. పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి ఏర్పాట్లలో అధికారుల మధ్య సమన్వయలోపం భక్తులకు శాపంగా మారింది. పాదగయ వెనుకభాగంలో ఉన్న గేటు తాళాలు వేసి అధికారుల వద్దే ఉంచుకోవడంతో లోపలకు వచ్చే వివిధ శాఖల ఉన్నతాధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పిఠాపురం మునిసిపల్ కమిషనర్ కనకారావు పాదగయ క్షేత్రం వద్దకు వచ్చినా గేటు తీయకపోవడంతో లోపలకు రాలేకపోయారు. దీంతో ఆగ్రహించిన మునిసిపల్ అధికారులు పురపాలక సంఘం తరపున నిర్వహించే పారిశుధ్య నిర్వహణ, ఇతర సేవలను నిలిపివేస్తామని ఒక సమయంలో హెచ్చరించారు. వైద్యశిబిరం నిర్వహణకు వచ్చిన ప్రభుత్వ వైద్యులను లోపలకు అనుమతించకపోవడంతో వారు వెనుతిరిగారు. శివరాత్రి నిర్వహణలో అధికారుల వైఫల్యంపై ఆలయ కమిటీ మాజీ చైర్మన్ తలిశెట్టి వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ బాలిపల్లి రాంబాబు, శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం చైర్మన్ రెడ్డెం జనార్దన్ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దొరబాబు సమక్షంలో ఈవో పులి నారాయణమూర్తిని నిలదీశారు. మరోవైపు దర్శనం క్యూలైన్లల్లో మార్పులతో భక్తులు అవస్థలు పడ్డారు.

నేటి నుంచి రెండురోజులపాటు..

కాకినాడలో తెలుగు సాహితీ సదస్సు

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక

పోర్టుసిటీ(కాకినాడ),మార్చి 8: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 30వ వార్షికోత్సవం సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో కాకినాడలో ఈనెల 9, 10 తేదీల్లో రెండు రోజులపాటు అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కాకినాడ దంటు కళాక్షేత్రంలో శని, ఆదివారాల్లో జరిగే ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు విచ్చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం ఫౌండేషన్ చైర్మన్ వంగూరి చిట్టెన్‌రాజు, ఆహ్వాన సంఘ సభ్యుడు మార్ని జానకిరామ్‌చౌదరి తదితరులు పర్యవేక్షించారు. అనంతరం చిట్టెన్‌రాజు మాట్లాడుతూ ఫౌండేషన్ 30వ వార్షికోత్సవ సందర్భంగా కాకినాడలో మొదటిసారిగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన వందమందికిపైగా సాహితీవేత్తలతో ఎనిమిది వేదికలతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సినీ గేయ రచయిత భువనచంద్రకు జీవన సాఫల్య పురస్కారం అందజేయనున్నామన్నారు. సదస్సులో రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మాజీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, బేతవోలు రామబ్రహ్మంతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొననున్నారని తెలిపారు. సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు.



సదస్సు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నిర్వాహకులు

కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా పీసీసీకి అందజేత

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పాండు రంగారావు

కాకినాడ సిటీ, మార్చి 8: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాకినాడ జిల్లాలోని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై పోటీకి పేర్లు సూచిస్తూ కాకినాడ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావు పీసీసీకి జాబితా సమర్పించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై పోటీ చేసే ఆశావహులనుంచి గతనెల 29 వరకు విజయవాడలోని ఆంధ్రరత్న భవన్ పీసీసీ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించారు. కాకినాడ పార్లమెంట్‌స్థానం నుంచి ఇద్దరు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 20మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. రెండురోజుల క్రితం మంగళగిరిలో టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆశావాహులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో డీసీసీ అధ్యక్షుడు పాండురంగారావు జిల్లానుంచి పోటీకి అభ్యర్థులను సూచిస్తూ నివేదిక పంపారు. కాకినాడ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి శ్రీరామచంద్రమూర్తి(రాంబాబు)ను సూచించారు. అసెంబ్లీల వారీగా తుని నియోజకవర్గంనుంచి పోటీకి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గేలం శ్రీనివాసరావు, ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గంనుంచి డీసీసీ ఉపాధ్యక్షుడు ఎన్‌వీవీ సత్యనారాయణ, పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గంనుంచి బ్లాక్-టు ప్రెసిడెంట్ మాదేపల్లి సత్యానందరావు, కాకినాడ రూరల్ నియోజకవర్గంనుంచి పిల్లి సత్యలక్ష్మి, పెద్దాపురం నియోజకవర్గం నుంచి పీసీసీ మెంబర్ తుమ్మల దొరబాబు, కాకినాడ సిటీ నియోజకవర్గం నుంచి బీసీ సెల్ ప్రెసిడెంట్ చెక్క నూకరాజు, జగ్గంపేట నియోజకవర్గం నుంచి పీసీసీ అధికార ప్రతినిధి మారోతి గణేశ్వరరావులను సూచిస్తూ నివేదిక అందజేశారు.

నేడు, రేపు ఆస్తి పన్నుల స్వీకరణ

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 8: పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం సెలవు రోజులైనప్పటికీ ఈనెల 9, 10తేదీల్లో కూడా పన్నులను స్వీకరిస్తామని కమిషనర్ జె.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. సినిమారోడ్‌లోని పాత మున్సిపల్ కార్యాలయంతోపాటు అన్ని సచివాలయాల్లో పన్నులు స్వీకరిస్తామన్నారు. ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులకు సంబంధించి పాత బకాయిలపై వడ్డీ రాయితీ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అందువల్ల పాత, ప్రస్తుత ఆర్థిక సంవత్సర పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బకాయిలు చెల్లించాలని కమిషనర్ చెప్పారు.



మూలవరుల పూజకు దాత అందించిన లక్షచామంతులు

మహాశివరాత్రి సందర్భంగా..

మూలవరులకు లక్ష చామంతుల పూజ

అన్నవరం, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని సత్యదేవుడి సన్నిధిలో మూలవరులకు శుక్రవారం సాయంత్రం లక్ష చామంతుల పూజను ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా వీటిని పచ్చిగోళ్ల రాజబాబువారి కుటుంబీకులు అందజేస్తుంటారు. ఈ సందర్భంగా ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. లింగోద్భవకాలంలో మూలవరుల్లో ఒకరైన శంకరుడికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు, నీరాజనమంత్ర పుష్పాలు అందజేశారు.



రాజమండ్రి కోటిలింగాల రేవు వద్ద భక్తుల రద్దీ



రాజమండ్రి పుష్కరాల రేవు వద్ద భక్తులు

భక్తజన హోరు

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



క్యూలో భక్తులు

కిక్కిరిసిన ద్రాక్షారామ

ద్రాక్షారామ, మార్చి 8: ద్రాక్షారామ భక్తజన సంద్రంగా మారింది. భీమేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 4.00 గంటల నుంచి భీమేశ్వర స్వామివారి దర్శనానికి భక్తుల రాక మొదలయ్యింది. ఉదయం 10 గంటల ప్రాంతానికి తీవ్ర రద్దీ నెలకొంది. క్యూలైన్లలో భక్తులు బారులుతీరారు. భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మ వారిని దర్శించుకున్నారు. అభిషేకాలు నిర్వహించారు. రాత్రి 8 గంటల వరకు స్వామివారికి అభిషేకాలు జరిగాయి. రాత్రి 8.30 గంటలకు దేవస్థానం ఆధ్వర్యంలో భీమేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రిపూజ నిర్వహించారు. 12 గంటలకు మహానివేదన చెల్లించారు. రాత్రి 1.30 వరకు స్వామిని భక్తులు దర్శించుకున్నారు. చండీ హోమ పండితులు ఇంద్రకంటి రామారావుశర్మ ఆధ్వర్యంలో ఆలయంలో జ్యోతిర్లింగార్చన జరిగింది. ఆలయ ఉత్సవ అధికారి, దేవదాయశాఖ ఉప కమిషనరు ఎం.విజయరాజు పర్యవేక్షణలో, ఈవో పి.టి.వి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, ఇతర ఆలయాల సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు భక్తులకు సేవలు అందించారు.



పూలు, విద్యుత్ దీపాలతో అలంకరణ

అఖండ దీపారాధన

ద్రాక్షారామలో దక్షగుండం వద్ద వేంచేసియున్న ఘంటాంబిక అమ్మవారి ఆలయం వద్ద మహాశివరాత్రి పురస్కరించుకుని శుక్రవారం రాత్రి అఖండ దీపారాధన జరిగింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతులు, వ్యాపారవేత్త సత్తి సుబ్బారెడ్డి దంపతులు అఖండ దీపారాధనను ప్రారంభించారు. కోటిపల్లి రోడ్డులో అమ్మవారి ఆలయ గోపురం వద్ద నుంచి ఆలయం వరకు ఇరువైపులా స్టాండ్లు ఏర్పాటు చేసి ప్రమిదలతో దీపాలు వెలిగించారు. సుమారు 300 మీటర్లు పొడవునా ఇరువైపులా దీపారాధన జరిపారు. అదే విధంగా ఆలయం వద్ద శివలింగాలు చెక్కలతో ఏర్పాటు చేసి ప్రమిదలతో దీపాలు వెలిగించారు. ద్రాక్షారామ బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుష్ప శివలింగాన్ని భక్తులు దర్శించుకున్నారు.

భీమేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు



అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

సామర్లకోట, మార్చి 8: హరహర మహాదేవ శంభో శంకర అంటూ పంచారామ పుణ్య క్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం మారుమోగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో క్యూలైన్లన్నీ కిక్కిరిసాయి. క్యూలైన్లు, వీఐపీ దర్శనాలకు ఏర్పాటు చేసిన మార్గాల వద్ద తీవ్రమైన రద్దీ, తొక్కిసలాటలు జరిగాయి. సకాలంలో పోలీసులు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. బందోబస్తు చర్యలను డీఎస్పీ కె.లతాకుమారి ఎప్పటికప్పుడు సమీక్షించారు. కోనేరు పుష్కరిణి, గోదావరి పుష్కరిణిల వద్ద తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. దాతలు ఏర్పాటు చేసిన జల్లు స్నానఘట్టాల వద్ద కూడా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కెనాల్ రోడ్డు పొడవునా వాహనాలు, కార్లు పార్కింగ్ చేయడంతో పలు దఫాలు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాగా సామర్లకోట మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఆలయ ఆవరణలో సమగ్ర పారిశుధ్యచర్యలు చేపట్టలేదన్న ఆరోపణలు ఉన్నాయి. భక్తుల క్యూలైన్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చీఫ్ ఫెస్టివల్ అధికారిణి అల్లు వెంకట దుర్గాభవాని సిబ్బందికి తగు సూచనలు చేశారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్నానాలాచరిస్తున్న భక్తులు

భక్తజన సంద్రం

..పాదగయ క్షేత్రం

పిఠాపురం, మార్చి 8: శివనామసర్మణతో పిఠాపురం మారుమోగింది. పట్టణ వీధులన్ని భక్త జనసందోహంతో కిక్కిరిసిపోయాయి. పాదగయ పుష్కరిణిలో స్నానాలకు, కుక్కుటేశ్వరస్వామి దర్శనానికి కిలోమీటర్ల మేర భక్తులు బారులు తీరారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం పిఠాపురం పట్టణం భక్త జన సంద్రమైంది. పాదగయ క్షేత్రానికి తరలి వచ్చే రహదారులన్ని భక్తులతో కిక్కిరిసిపోయాయి. పాదగయ పుష్కరిణిలో స్నానాలు ఆచరించేందుకు గురువారం అర్ధరాత్రి నుంచే భక్తులు బారులు తీరారు. తెల్లవారుజాము సమయానికే పాదగయ బయట కిలోమీటరు మేర భక్తులు బారులు తీరారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రారంభమయిన భక్తుల రద్దీ రాత్రి వరకూ కొనసాగింది. పాదగయ పుష్కరిణిలో సుమారు 3 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు అంచనా. పుష్కరిణిలో స్నానాలు ఆచరించిన భక్తులు పాదగయ క్షేత్రంలో స్వయంభూ కుక్కుటేశ్వర స్వామి ఆది శంకరాచార్య ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీదేవి, స్వయంభూ దత్తాత్రేయస్వామి అష్టాదశ శక్తిపీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్టాన దేవతైన పురుహూతికా అమ్మవార్లను, ఇతర ఉపాలయాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

కుక్కుటేశుని నిజరూప దర్శనం

గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట నుంచి కుక్కుటేశ్వరస్వామి భక్తులకు నిజరూపంలో దర్శనమిచ్చారు. కుక్కుటేశ్వరస్వామికి లక్షబిల్వార్చన, రాజరాజేశ్వరీదేవి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తదితరులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో, సహాయ కమిషనరు పులి నారాయణమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం రథోత్సవం నిర్వహించనున్నారు. రోజున భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంది పురపాలక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. జనసేన నియోజకవర్గ నేత డాక్టర్ పిల్లా శ్రీధర్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

కోటిపల్లి పుణ్యక్షేత్రం కిటకిట





క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

కె.గంగవరం, మార్చి 8: కోటిపల్లి పుణ్యక్షేత్రం కిక్కిరిసింది. స్వామి వారికి వేకువజామున గోదావరి నది నుంచి తీర్థపు బిందె తీసుకువచ్చి బాలభోగం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రీ ఛాయా సోమేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ తనిఖీ అధికారి బాలాజీ రామ్‌ప్రసాద్, దేవస్థానం ఈవో ఎం.శ్రీదేవి భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఆర్యవైశ్య సంఘం వారు, కాకతీయ సంఘం, శాలివాహన సంఘం, ఫైండా వారి అన్నసత్రం, మాన్సాస్ ట్రస్టుతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కోటిపల్లి ఫెర్రీ రేవులో తెలుగుదేశం పార్టీ నాయకుడు రేవు శ్రీను పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. రామచంద్రపురం డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు శాఖ బందోబస్తు నిర్వహించింది. ఫెర్రీ రేవు, స్నానఘట్టాలు, రేవులోని బస్‌స్టాండ్, రేవులో నుంచి దేవస్థానానికి వచ్చే రహదారి, ఆలయం లోపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షించారు. పామర్రు ఎస్ఐ జానీ బాషా కంట్రోల్ రూం వద్ద నుంచి పరిస్థితిని పర్యవేక్షించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రామచంద్రపురం ఆర్‌డీవో సుధాసాగర్ స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం క్యూలైన్లలో ఉన్న భక్తుల వద్దకు వెళ్లి ఏర్పాట్లు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్ పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య నిర్వహణ చేశారు. తహసీల్దార్ రవీంద్రబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సేవలందించారు. మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ పిల్లి సూర్యప్రకాష్, ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ పిల్లి శ్రీనివాసు, మాజీ సర్పంచ్ అయినవిల్లి అబ్బు పూజలు చేశారు.

మహిళలు ఉచిత న్యాయ సహాయం పొందాలి


ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



సమావేశంలో మాట్లాడుతున్న గంధం సునీత

రాజమహేంద్రవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సేవలు పొందడానికి మహిళలందరూ అర్హులేనని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మహిళా ప్రత్యేక కారాగారంలో నిర్వహించిన వేడుకలకు హాజరై మహిళా ఖైదీలు, జైలు సిబ్బందికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కారాగారంలో ఉన్న మహిళలు ఏ విషయాల గురించీ ఆందోళన చెందవద్దన్నారు. ఉచిత న్యాయ సహాయం పొందే అవకాశాన్ని అవసరమైన మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి మహిళలు, పిల్లలు, బడుగు బలహీన వర్గాలకు డీఎల్ఎస్ఏ అందిస్తున్న సేవల గురించి వివరించారు. వేడుకల్లో భాగంగా మహిళలు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఐజీ ఎంఆర్ రవికిరణ్, ఓఎన్‌జీసీ సీజీఎం మనీష శర్మ, జీఎం సంగీత సాహు, కారాగార సూపరింటెండెంట్ సీహెచ్ వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు ముమ్మిడివరంలో బాలయోగీశ్వరుల తీర్థం





ముమ్మిడివరం, మార్చి 8: శివరాత్రి తర్వాత రోజైన శనివారం జరిగే బాలయోగీశ్వరుల తీర్థం చాలా ప్రాముఖ్యమైనది. దీక్షలో ఉండగానే 1985 జూలై 19న పెదబాలయోగీశ్వరులు, ఆ తర్వాత 1991 అక్టోబరు 28న చినబాలయోగీశ్వరులు కైవల్య సిద్ధి పొందారు. వారిని తపో మందిరంలోనే సమాధి చేశారు. నేటికీ ఆ సమాధులను దర్శించుకునేందుకు దేశ విదేశాల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. బాలయోగీశ్వరుల తీర్థాన్ని పురస్కరించుకుని ముమ్మిడివరంలోని బాలయోగీశ్వరుల ఆశ్రమాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. శుక్రవారం శివరాత్రి సందర్భంగా బాలయోగీశ్వరుల దివ్య సమాధుల వద్ద ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన, రాత్రి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున 4 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు మండపంపై బాలయోగీశ్వరుల విగ్రహ దర్శనం, సమాధుల దర్శనం ఉంటుంది. దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఆశ్రమ కమిటీ, కుటుంబ సభ్యులు వసతి, భోజనం వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు.





అవార్డు అందుకుంటున్న రవితేజ

ఉత్తమ పోలీసు అధికారిగా వాసంశెట్టి రవితేజ

మామిడికుదురు, మార్చి 8: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పెదపట్నంలంక గ్రామానికి చెందిన వాసంశెట్టి రవితేజ ఉత్తమ పోలీసు అధికారిగా అవార్డు అందుకున్నారు. రవితేజ ప్రస్తుతం గుజరాత్ లోని గాంధీనగర్ ఎస్పీగా పనిచేస్తున్నారు. గురువారం జరిగిన సమావేశంలో గుజరాత్ రాష్ట్ర డీజీపీ వికాస్ సాహి నుంచి ఉత్తమ పోలీసు అధికారి అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని రవితేజ అందుకున్నారు. ఈ మేరకు ఆయన తండ్రి, హైకోర్టు న్యాయవాది వాసంశెట్టి నాగేశ్వరరావు వివరాలు తెలిపారు. కోనసీమలోని మారుమూల గ్రామంలో జన్మించిన రవితేజ 2015 ఐపీఎస్ బ్యాచ్ నుంచి ఎంపికై గుజరాత్‌లో సమర్థవంతంగా విధులు నిర్వహించి అక్కడి ప్రజల మన్ననలు పొందారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి ఇతర రాష్ట్రంలో అవార్డు అందుకోవడంపై పెదపట్నంలంక గ్రామ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాన్-ఆటో ఢీ

పట్టుబడిన రేషన్ బియ్యం

గండేపల్లి, మార్చి 8: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం జెడ్.రాగంపేట గ్రామ శివారులో శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి బి.ప్రత్తిపాడు వెళుతున్న వ్యాన్ జెడ్ రాగంపేట వచ్చేసరికి డివైడర్‌పైకి ఎక్కి రైలింగ్ దాటి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటోతో పాటు మినీ వ్యాన్ బోల్తా పడింది. అయితే ఆటోలో రోడ్డు వర్కింగ్ కూలీలు నలుగురికి గాయాలయ్యాయి. వారిని పోలీసు హైవే పెట్రోలింగ్ సిబ్బంది చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఐషర్‌వ్యాన్‌లో ఉన్న రేషన్ బియ్యం బస్తాలు చెల్లాచెదురుగా పడ్డాయి. అయితే ఈ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు గుర్తించారు. విజయవాడ నుంచి బి.ప్రత్తిపాడులోని ఒక షాపునకు బియ్యం తరలిస్తున్న బి. ప్రత్తిపాడుకు చెందిన వెలుగుల వాసుపై కేసు నమోదు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయిస్ సీఐ రాజు, డీఎస్‌వో ప్రసాద్, సిబ్బంది బియ్యం స్వాధీనం చేసుకుని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి అతనిపై కేసు నమోదు చేశారు.

పట్టుబడిన రేషన్ బియ్యం



ఫైనాన్స్ కంపెనీలో రూ.12 లక్షల చోరీ



సీసీ కెమెరాల్లో రికార్డయిన నిందితుల దృశ్యాలు

రాజమహేంద్రవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఫైనాన్స్ కంపెనీలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇన్నీసుపేట పాత స్టేట్‌బ్యాంకు మొదటి అంతస్తులో ఒక ఫైనాన్సు కంపెనీ కార్యాలయం ఉంది. అందరూ శివరాత్రి హడావుడిలో ఉండగా అగంతకులు శుక్రవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో ఇనుపరాడ్డుతో షట్టరును బలవంతంగా మనిషి దూరే ఎత్తుకు పైకిలేపి లోనికి ప్రవేశించారు. లోపల టేబుల్ సొరుగు తాళాన్ని స్క్రూడ్రైవర్లతో తొలగించి సుమారు రూ.12 లక్షల నగదును అపహరించారు. సీసీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు ఇద్దరు అనుమానితులను గుర్తించారు. వాళ్ల ఫొటోలను ఎస్పీ జగదీశ్ మీడియాకు విడుదల చేశారు. దొంగల ఆచూకీ తెలిపిన వారికి రూ.20 వేల బహుమతి అందజేస్తామని ప్రకటించారు. టూటౌన్ సీఐ ఫోన్ 9440796576 లేదా సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ ఫోన్ 94907607918కి సమాచారం అందించాలని కోరారు. ఆచూకీ తెలిపిన వారి వివరాలు గోప్యంతా ఉంచుతామన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

ఆటో డ్రైవర్ మృత్యువాత



గొల్లప్రోలు, మార్చి 8: ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో ఆటో డ్రైవర్ మరణించాడు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఇసుకపల్లికి చెందిన రాయి సూర్యచంద్ర(32) పిఠాపురం నుంచి గొల్లప్రోలుకు ఆటో నడుపుకుంటూ వెళుతుండగా, బైపాస్ రోడ్డులో వై జంక్షన్ వద్దకు వచ్చేసరికి కత్తిపూడి నుంచి పిఠాపురం వెళుతున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టి పంట పొలాల్లోకి దూసుకుపోయింది. తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్ సూర్యచంద్రను పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మరణించినట్లు వైద్యులు తెలిపారు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శివునిలో సగం..అవనిలో సగం

రంగంపేట, మార్చి, 8 : మహాశివరాత్రి, మహిళా దినోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం రంగంపేటకు చెందిన ప్రముఖ సైకతశిల్పి దేవిన శ్రీనివాస్ 150 సంవత్సరాల చరిత్ర కలిగిన రంగంపేట శివాలయంలో అమ్మవారి సైకత శిల్పాన్ని పండ్లు, కూరగాయలతో చెక్కారు. శివునిలో సగం - అవనిలో సగం మేమే.. అనే నినాదంతో వినూత్నంగా తీర్చిదిద్దారు.

కాకినాడ



సారె, కలశాలతో ప్రదర్శన

గొల్లప్రోలులో గనిచెల్లి ఉత్సవాలు

గొల్లప్రోలు, మార్చి 8: పట్టణంలోని ఈబీసీ కాలనీలో గనిచెల్లి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు సారె, కలశాలతో ప్రదర్శన చేశారు. అన్నదానం జరిగింది. ఆది గురుభవాని ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, గొల్లప్రోలు నగరపంచాయతీ మాజీ చైర్మన్ శీరం మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ టీడీపీ కోఆర్డినేటర్‌గా పిల్లి సత్యనారాయణమూర్తి

కో కోఆర్డినేటర్‌గా కటకంశెట్టి ప్రభాకర్



సత్యనారాయణమూర్తి



ప్రభాకర్

సర్పవరం జంక్షన్, మార్చి 8: టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా పిల్లి సత్యనారాయణమూర్తి, కో కోఆర్డినేటర్‌గా కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు నియామక ఉత్తర్వులను పత్రికలకు విడుదల చేశారు. పిల్లి సత్యనారాయణమూర్తి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా పార్టీలో పదవులు నిర్వహించారు. ఆయన భార్య పిల్లి అనంతలక్ష్మి సంపర, కాకినాడ రూరల్ ఎమ్మెల్యేలుగా 2పర్యాయాలు పని చేశారు. టీటీడీ బోర్డు డైరెక్టర్‌గా పని చేశారు. రాబోయే ఎన్నికల్లో రూరల్ సీటును ఆశించారు. టీడీపీ-జనసేన పొత్తులో భాగంగా కాకినాడ రూరల్ అసెంబ్లీ సీటు జనసేనకు కేటాయించడంతో అసంతృప్తితో ఉన్న పిల్లి దంపతులను బుజ్జగించి, పార్టీ క్యాడర్‌ని సమన్వయం చేసి, ఉమ్మడి అభ్యర్థి గెలుపు కోసం పార్టీ అధిష్టానం కోఆర్డినేటర్‌గా నియమించింది. అలాగే కటకంశెట్టి ప్రభాకర్ ఉమ్మడి జిల్లా తెలుగు యువత అధ్యక్షుడిగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

సత్యనారాయణమూర్తికి నానాజీ శుభాకాంక్షలు



పిల్లి దంపతులను సత్కరిస్తున్న నానాజీ

కాకినాడ రూరల్, మార్చి 8: టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా నియమితులైన పిల్లి సత్యనారాయణమూర్తి అనంతలక్ష్మి దంపతులను వలసపాకలలోని వారి నివాసంలో శుక్రవారం జనసేన పీఏసీ సభ్యుడు, కాకినాడ రూరల్ జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ కలిసి దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీల నాయకులమంతా ఐక్యమత్యంగా పని చేసి కృషి చేసి ఉమ్మడి అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

'ఆశీర్వదించండి.. అండగా ఉంటా'



ఎస్.అన్నవరంలో ప్రచారంలో యనమల దివ్య

తుని రూరల్, మార్చి 8: తునిని అభివృద్ధి బాటలో నడిపించి ప్రజా మన్ననలు పొందిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు కుమార్తెగా తుని నుంచి పోటీ చేస్తున్నానని, తనను ఆశీర్వదించాలని అందరికీ అండగా ఉంటానంటూ ఎస్.అన్నవరం గ్రామంలో ఇంటింటా ప్రచార కార్యక్రమంలో తుని టీడీపీ అభ్యర్థి యనమల దివ్య స్పష్టం చేశారు. ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటూ టీడీపీ, జనసేన మేనిఫెస్టో అంశాలు వివరించారు. యనమల శివరామకృష్ణన్, మోతుకూరి వెంకటేష్, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, చోడిశెట్టి వెంకటేష్, వంగలపూడి శ్రీనివాస్, చింతమనీడి నాగ సోమరాజు, గజ్జి అప్పలరాజు, పలకా సోమేశ్వరరావు, జక్కాన రామునాయుడు, ఆవుగడ్డి వెంకటరమణ, పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కోటనందూరు: అల్లిపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు ఆధ్వర్యంలో మీఇంటికి మీదివ్య కార్యక్రమం చేపట్టగా యనమల దివ్య మాట్లాడారు. యనమల శివరామకృష్ణన్, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, డి.చిరంజీవిరాజు, అరవింద్ వర్మ అంకంరెడ్డి బుల్లిబాబు, రుత్తలశ్రీనివాస్, వెలగా వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

'రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమే'

తుని రూరల్, మార్చి 8: రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనని రాష్ట్ర ప్రతిపక్ష నేత, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంట యనమల స్వగృహంలో నియోజకవర్గానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం ఎస్.అన్నవరం గ్రామానికి చెందిన టీడీపీ నేత పోలిశెట్టి రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన గరగా సూర్యారావు ఆ పార్టీకి రాజీనామా చేసి యనమల సమక్షంలో టీడీపీలోకి చేరారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు ప్రజలతో మమేకమై ముందుకు సాగాలన్నారు. ఎస్.అన్నవరానికి చెందిన బోడా జమీలు, చోడిశెట్టి దొంగబాబు, పోలిశెట్టి వీరబాబు,పోలిశెట్టి మార్కండేయులు, బోడ సాగర్, కంకిపాటి రమణ, దాసరి త్రిమూర్తులు, పందిరి శ్రీను పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

ఏలేశ్వరం, మార్చి 8: పట్టణానికి చెందిన పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. 6వ వార్డుకు చెందిన నండా మాధవి, పడాల జ్యోతి ఆధ్వర్యంలో శుక్రవారం సుమారు 30కుటుంబాలకు ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి సత్యప్రభ పార్టీ కండువాలు ఆహ్వానించారు. నేతలు, కౌన్సిలర్లు కోనాల వెంకటరమణ, యండగుండి నాగబాబు, పెంద్ర శ్రీను, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, జిగటాపు సూరిబాబు, చందువోలు సాయితేజ, భజంతుల మణి, మామిడి మాధవి, మైనాల కనకారావు ఉన్నారు.

'టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలతో పేదలకు మేలు'

తొండంగి, మార్చి 8: టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల ద్వారా పేదలకు మేలు చేకూరుతుందని రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు అన్నారు. శుక్రవారం ఆయన ఒంటిమామిడి పార్టీ కార్యాలయంలో సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను విడుదల చేశారు. ఉచిత బస్ సౌకర్యం, 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు, పింఛన్లుతదితర ఆరు ప్రజోపకరమైన పథకాలను టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే అమలు చేస్తుందని వీటిని కార్యకర్తలు ఇంటింటికి ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పేకేటి హరికృష్ణ, మత్స్యకార జిల్లా నాయకులు కోడ వెంకటరమణ, మండలాధ్యక్షులు చొక్కా అప్పారావు, మురాలశెట్టి సత్యన్నారాయణ, బంటుపల్లి అన్వేష్, చొక్కా కాశీ, పిల్లి బాబ్జి, కటకం ఈశ్వర్రావు ఉన్నారు.

'రజకులకు సముచిత స్థానం కల్పించిన టీడీపీ'

పెద్దాపురం, మార్చి 8: రజకులను అన్ని విధాలుగా సముచిత స్థానం కల్పించింది టీడీపీయే అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, రజక, దాసరి సాధికార కమిటీల రాష్ట్ర కోఆర్డినేటర్ కాకినాడ రామారావు అన్నారు. స్థానిక విలేఖరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. రజకుల కోసం బీసీ డిక్లరేషన్ ప్రకటించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలను తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తక్షణమే రజకులకు ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. అలాగే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడును కలిసి కృతజ్ఞతలు తెలియచేశామని చెప్పారు. సమావేశంలో దువ్వారపు రామారావు, రజక సంఘ నేతలు పాల్గొన్నారు.

పోతులూరులో లిబరేషన్ ప్రదర్శన

ప్రత్తిపాడు, మార్చి 8: మండలంలోని పోతులూరు గ్రామంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్, ప్రగతి శీల మహిళా సంఘం కార్యకర్తలు శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. మహిళలకు రక్షణ కల్పించాలని, మహిళలపై అత్యాచారాలు, వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేస్తూ అల్లూరి సీతారామరాజు సెంటర్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆందోళనకు లిబరేషన్ రాష్ట్రకమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు నాయకత్వం వహించగా ప్రగతి శీల మహిళా సంఘం సభ్యులు మాది అంకాయమ్మ, పోలవరం రామలక్ష్మి, బండి నాగమణి, మానుకొండ కృష్ణ, చిన్నం అప్పలరాజు, కందూరి రాజమణి, చిన్నం బేబిదాసు, నూకాలమ్మ తదితరులున్నారు.

బోట్‌క్లబ్ చెరువులో పడి వ్యక్తి మృతి

సర్పవరం జంక్షన్, మార్చి 8: కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట మార్కెట్ గొల్లపేటకు చెందిన గొర్ల వెంకటరమణ (64) బోట్‌క్లబ్‌కి వెళ్లి ప్రమాదవశాత్తూ తూలి చెరువులో పడి మృతిచెందినట్టు అతడి కుమారుడు సత్తిబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటరమణకు మద్యం తాగే అలవాటు ఉండడంతో తులిపోయి చెరువులో పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. సర్పవరం పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ భద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్ర్కీన్స్: భీమా, గామి, ప్రేమలు, వి లవ్ బ్యాడ్‌బాయ్స్, హనుమాన్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్ర్కీన్స్: భీమా, గామి, ప్రేమలు, బుజ్జిగయ్, ఆపరేషన్ వాలైంటైన్,బాబుసెంటర్ 1, దుని, బుజ్జైట

తిరుమల	:	భీమా
లక్ష్మి	:	భీమా
సీ అండ్‌సీ1	:	గామి
సీ అండ్‌సీ2	:	ప్రేమలు
శ్రీప్రియ	:	గామి
పద్మప్రియ	:	ప్రేమలు
సత్యగౌరి	:	గామి, ప్రేమలు
సూర్య 1	:	గామి
సూర్య 2	:	భీమా

కాకినాడలో 'కార్నవల్'

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 8: కాకినాడ క్రేగ్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చ్ ప్రాంగణంలో కార్నవల్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జార్ఖండ్‌లోని మాల్టోవా పిల్లల ప్రాథమిక విద్యకు సహకరించే సదుద్దేశంతో ఏటా ఈ కార్నవల్ నిర్వహిస్తున్నట్టు రంగరాయ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పీవీ ప్రసన్నకుమార్ తెలిపారు. మెడికల్ స్టాల్ ఏర్పాటు చేసి పలు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన నగదును మాల్టోవా ప్రజలకు విరాళంగా అందిస్తామని తెలిపారు.

ఓం శివోహం

» వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
» భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
» ప్రత్యేక పూజలు, అభిషేకాలు
» పుణ్యస్నానాలు, అన్నదానాలు



ఏలేశ్వరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



గొల్లప్రోలు రూరల్: దుర్గాడలో ప్రత్యేక అలంకారంలో ఉమారామ లింగేశ్వరస్వామి

సామర్లకోట, మార్చి 8: ఓం శివోహం..హర హర శివ శంభో శంకరా.. పాహిమాం అంటూ భక్తుల శివ నామస్మరణతో శైవక్షేత్రాలు, పరిసర ప్రాంతాలు మార్మోగిపోయాయి. పంచారామ పుణ్య క్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. ఈ పూజల్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మ కాయల రాజప్ప, ఆర్డీవో జెఎస్వీ రామారావు దంపతులు, జెడ్పీ సీఈవో ఎన్వీవీసత్యనారాయణ, ఆదర్శరైతు గుణ్ణం సురేష్ కుటుంబీకులు పాల్గొన్నారు. శివరాత్రి సందర్భంగా ఆలయంలో వాసవీ యూత్ సభ్యుల సౌజన్యంతోనూ 12 వేలమంది భక్తులకు అన్న దానాలు నిర్వహించారు. వేట్లపాలెం కొండపల్లి కృష్ణమూర్తి కుటుంబసభ్యులతో సుమారు 1000 మంది చిన్నారులకు పంపిణీ చేశారు. వాసవీ క్లబ్, వాసవీ కపుల్స్ భీమేశ్వరా క్లబ్ ప్రతినిధులతో చిన్నారులకు 150లీటర్ల పాలు,రొట్టెలు, పెద్దలకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. లయన్స్ భీమేశ్వరా క్లబ్, ఉప్పువారి సత్రం వ్యవస్థాపక కుటుంబీకులు సంయుక్తంగా పాలు, రొట్టెలు, మజ్జిగ, అల్పాహారం భక్తులకు పంపిణీ చేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో 2వేల మందికి మజ్జిగ పంపిణీ చేశారు. సామర్లకోట సర్వేజన సుఖినోభవంతు స్వచ్ఛంద సంస్థ భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. సామర్లకోటలో ఆనందభవనం నందు బ్రహ్మకుమారీలు శివలింగ దర్శనాల ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ కమీషనర్ జాస్తి రామారావు, మాజీ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంతపద్మనాభం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బ్రహ్మకుమారీస్ చీఫ్ బీకె.లక్ష్మి ఉన్నారు.

సర్పవరం జంక్షన్: మండలంలోని నేమాంలో శ్రీపర్వతి వర్ధినీ శ్రీఉమారామలింగేశ్వరస్వామి, సర్పవరంలో శ్రీభవాని సమేత నీలకంఠేశ్వరస్వామి, సూర్యారావుపేటలో శ్రీశ్రీశ్రీ కాత్యాయని సమేత సహస్ర మహాలింగేశ్వరస్వామి, తిమ్మాపురంలో కాశీ విశ్వేశ్వరస్వామి, తూరంగిలో తూరంగేశ్వరస్వామి, ఇంద్రపాలెంలో శ్రీగౌరీ కేదేశ్వరి స్వామి, రేపూరులో స్వయంభు ఆలయానికి వేలాది మంది భక్తులు వచ్చి శివుడ్ని దర్శించుకున్నారు. రమణయ్యపేట శ్రీపీఠంలో నిర్వాహకులు స్వామి పరిపూర్ణానంద ఆధ్వర్యంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు.

ఏలేశ్వరం: ఏలేశ్వరంలో కాశీ క్షేత్రంగా పేరుగాంచిన శ్రీరాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంతోపాటు లింగంపర్తి భోగేశ్వరస్వామి, సిరిపురం రామలింగేశ్వరస్వామి శైవక్షేత్రాలు భక్తులతో కిగకిగలాడాయి. ఏలేరునదీతీరాన ఘాట్‌లలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయ ప్రధాన అర్చకులు కోడూరి మహేష్, యలమంచిలి శేఖర్, వెంకటేష్ ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంచుతో వినాయకుడు, శివలింగం, వేంకటేశ్వరస్వామి ఆకారాలు ఏర్పాటు చేశారు. కౌన్సిలర్లు బదిరెడ్డి గోవిందు, వెంకటరమణమ్మ కుటుంబ సభ్యులతో అన్నదానం నిర్వహించారు. గోపు వెంకట్రావు, శ్రీనివాసరావు దంపతులతో బాలజీ చౌక్ సెంటర్‌లో పులిహోర పంపిణీ చేశారు. ఏలేశ్వరం ఎస్ఐ సతీష్ నేతృత్వంలో పోలీసలు బందోబస్తు చేపట్టారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి, రాచపల్లిలోని అపీత కుంచాంబ అరుణాచలేశ్వర స్వామి, ధర్మవరంలోని రాజరాజేశ్వరి సమేత విశ్వేశ్వర స్వామి, ఒమ్మంగిలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. రాచపల్లి శివాలయంలో దక్షిణామూర్తి,పంచభూతాలకు పూజలు నిర్వహించారు. కొండకోనల్లో ఉన్న దారపల్లి, ఎరకంపాలెం, తోటపల్లిలోని శివలింగాల వద్ద భక్తజన కోలాహలం కనిపించింది. ఎరకంపాలెం ధార మల్లికార్జున స్వామికి టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ పూజలు చేసి ఆలయం వద్ద అన్నదానంలో పాల్గొన్నారు.

జగ్గంపేట/జగ్గంపేట రూరల్: జగ్గంపేటలోని సర్వకామదాంబ సమేత ఉమా చంద్రశేఖర్ స్వామి ఆలయం నందు స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శివలింగాలకు పంచద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. కాట్రావులపల్లి, గుర్రంపాలెం, రామవరం, ఇర్రిపాకలో ఏలేరు నది ప్రవాహం ప్రాంతంలో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కుటుంబ సభ్యులు పూజలు చేశారు. రాజపూడి శివాలయం వద్ద పదివేలు మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గండేపల్లి: మల్లేపల్లి, ఉప్పలపాడు, తాళ్ళూరులో శివాలయాలు భక్తులతో సందడిగా మారాయి. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు.

తాళ్లరేవు: పాతకోరింగ శ్రీబాలత్రిపుర సుందరీ సమేత శ్రీకురంగేశ్వరస్వామి దేవస్థానం, కొత్తకోరింగ శ్రీవేణుగోపాలస్వామి, తాళ్లరేవు శ్రీవీరేశ్వరస్వామి దేవాలయం, పటవల అన్నపూర్ణేశ్వర ఆలయం, చొల్లంగిలో శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో పూజలు జరిగాయి.

తుని రూరల్: తపోవనం క్షేత్రంలో శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామిజీ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు, అభిషేకాలు నిర్వహించగా ప్రముఖులు, పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. తునిలో గవరపేట శివాలయం, తాండవలింగేశ్వర స్వామి, తేటగుంటలో ఉమామహేశ్వర స్వామి, తిమ్మాపురంలో ఉమా నాగ లింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

పెద్దాపురం: పట్టణ పరిధిలోని విశ్వేశ్వర చంద్రశేఖర స్వామి ఆలయం, కట్టమూరులో రాజారాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి, కాండ్రకోటలో భువనేశ్వరీ సమేత కోటేశ్వరస్వామి, ఆర్‌బీపట్నంలో చంద్రశేఖరస్వామి, జె.తిమ్మాపురంలో భీమేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లింగోద్భవ కాలంలో పరమశివుడికి రుద్రాభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. జాగరణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించి, పరమశివుడిని దర్శించుకుని కృపకు పాత్రులయ్యారు.

గొల్లప్రోలు రూరల్: తాటిపర్తిలోని అపర్ణా సమేత నాగేశ్వరస్వామి, దుర్గాడ శివాలయంలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పోటెత్తారు. దుర్గాడలో రామలింగేశ్వరస్వామి మహాకాలేశ్వరుడిగా అలంకారం చేశారు. తాటిపర్తిలో అపర్ణాదేవికి కుంకుమపూజలు నిర్వహించారు. గొల్లప్రోలు శివాలయానికి భక్తులు భారీగా వచ్చారు.

తొండంగి: ఏవినగరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయ ప్రాంగణంలో శివాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. శాసన మండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఏ.కొత్తపల్లి కదంబ క్షేత్రంలో భువనేశ్వరి సమేత విజయేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.



తాళ్లరేవు:పాతకోరింగ శివాలయంలో అభిషేకం



ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో అరుణాచలేశ్వరుని దర్శించుకుంటున్న భక్తులు



పెద్దాపురం మండలం కాండ్రకోటలో ప్రత్యేక అలంకరణలో భువనేశ్వరీ సమేత కోటేశ్వరస్వామి

రౌతులపూడి: రౌతులపూడి, మేరక చామవరంలో శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. గంగవరం, ఎస్ఎస్‌పట్నం, వేళంగి ధార స్నానాలకు తరలి వెళ్లారు. రౌతులపూడి యాదవకాలనీలో అన్నదానం చేపట్టారు.

కిర్లంపూడి: కిర్లంపూడి వైద్యనాదేశ్వరాలయం, పాలెంలో విజ్ఞేశ్వరాలయం, భూపాలపట్నంలో రామలింగేశ్వర ఆలయం, వేలంకలో తెల్లవారుజామున నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పూజలు అనంతరం అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

కరప: కరపలో పర్వతవర్ధినీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకులు విలపర్తి శ్రీనివాస్, రాజు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో కె.తిరుమలరవితేజ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అరట్లకట్ట గ్రామంలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామికి లింగోద్భవ పూజలు చేశారు.

శంఖవరం: కత్తిపూడి శివాలయంలో ఆలయ పూజారి ర్యాలీ సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు గావించారు. శంఖవరం ఆలయంలో పం డిత సత్కారం నిర్వహించారు. గంగాధరభట్ల అనిల్‌కుమార్‌శర్మ, వేదుల సూర్యనారాయణశర్మ అవధాని, భాగవతి రాజశేఖర శర్మ పురోహితులను ఎంపీపీ రాజబాబు సన్మానించారు.

కొత్తపల్లి: కొత్తపల్లిలో శ్రీబాలాత్రిపుర సుందరీసమేత రాజశేఖరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కొమరగిరి, నాగులాపల్లి, ఉప్పాడ, గోర్స, కొండెవరం తదితర గ్రామాల్లో కూడా నిర్వహించారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మహిళలకు సత్కారాలు, బహుమతులు



జగ్గంపేటలో మహిళలను సత్కరించిన నెహ్రూ



కరప: కేక్ కట్ చేస్తున్న జనసేన వీరమహిళలు

కాకినాడ సిటీ, మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఏపీఎన్జీవో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్జీవో హోంలో జరిగిన ఈ కార్యక్రమానికి మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్ బి.సుజాత అధ్యక్షత వహించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. వివిధ రంగాల్లో ప్రగతి సాధించిన మహిళా ఉద్యోగులను శాలువాలతో సత్కరించారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరేళ్ల చంద్రరావు, జిల్లా సంయుక్త కార్యదర్శులు ఎన్ఎంకేజీ ప్రసాద్, బి.శ్రీనివాసరావు, కాకినాడ యూనిట్ అధ్యక్షుడు ఎ.సత్తిరాజు, కార్యదర్శి రామకృష్ణ, స్టేట్ కౌన్సిలర్ ఎస్కే అజీజ్, మహిళా విభాగం కన్వీనర్ ఎ.దేవి, జిల్లా కోశాధికారి వై.పద్మమీనాక్షి, జిల్లా సంయుక్త కార్యదర్శి వి.కమల, కాకినాడ యూనిట్ ఉపాధ్యక్షురాలు వి.జయలక్ష్మి, సంయుక్త కార్యదర్శి బి.వెంకటలక్ష్మి, కోశాధికారి టి.దుర్గ పాల్గొన్నారు. అలయన్స్ క్లబ్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడారు. క్లబ్ అధ్యక్షుడు ఎం కిరణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. పలు రంగాల్లో మహిళలను సత్కరించారు. క్లబ్ కోశాధికారి కొత్త శ్రీరాములు, గణేష్, సతీష్, నాగమణి, శ్యామల, రేణుక పాల్గొన్నారు.

కాకినాడ జిల్లా తెలుగు మహిళాధ్యక్షురాలు సుంకర పావని ఆధ్వర్యంలో వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పార్టీ అభివృద్ధికి పాటుపడుతున్న మహిళా కార్యకర్తలను సత్కరించారు. తెలుగు మహిళా నాయకురాళ్లు గుత్తుల సూర్యావతి, బొందల రామలక్ష్మి, చెల్లా పార్వతి, బి.లోకేశ్వరి, సత్య పాల్గొన్నారు.

కార్పొరేషన్: జనసేన పార్టీ కాకినాడ సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ నాయకత్వంలో పాలెపు తలుపులమ్మ ఆధ్వర్యంలో ఏటిమొగ ప్రాంతం అంజనేయ స్వామి గుడి పరిసర ప్రాంతంలో స్థానిక మహిళలతో కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు శాలువాలు కప్పి సత్కరించారు. మల్లాడి లక్ష్మి, నరసమ్మ, బొమ్మిడి ధనలక్ష్మి, వెంకటలక్ష్మి, మడ్డు విజయ్‌కుమార్, కర్రి రాజు, వీరబాబు, బూరయ్య పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్ర వారం ఘనంగా నిర్వహించారు. మహిళాశక్తి కమిటీ మహిళలతో రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ మీడియా సమావేశం నిర్వహించారు. మహిళలందరిని ఘనంగా సన్మానించారు. టీడీపీ రాష్ట్ర అం గన్‌వాడీ విభాగం ఉపాధ్యక్షురాలు పోలినాటి ధర్మానంద కుమారి, మండల మహిళా అధ్యక్షురాలు నకిరెడ్డి సూర్యావతి, గుమ్మల అనంతలక్ష్మి, ఎల్లాటి అ మ్మాజీ, కేసుపోయిన గీతాకుమారి, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, బొల్లంరెడ్డి రామకృష్ణ, వేములకొండ జోగారావు, నాండ్ల చిరంజీవి, ఏద్రా శాస్త్రి, వెంపాటి రాజు, రాయి సాయి ఉన్నారు. రంగవల్లినగర్‌లో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడారు. కుంచే అంజిబాబు, శ్రావణి, దుర్గా పాల్గొన్నారు.

పిఠాపురం: పిఠాపురం టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ మాట్లాడారు. సమావేశానికి హాజరైన మహిళలకు వర్మ, ఆయన సతీమణి లక్ష్మీదేవి శుభాకాంక్షలు తెలిపి చీరలు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు పంపనబోయిన అన్నపూర్ణ, ముత్యాల దివ్య, సూర్నీడి ముత్యాలలక్ష్మి, దుర్గాడ విజయలక్ష్మి, నల్లా రమణమ్మ, పొన్నాడ భవానీ, మూగు సత్యవతి, బోడపాటి పద్మ తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు ఎస్సీ కమ్యూనిటీ హాలులో జనవిజ్ఞాన వేదిక సమతా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సమతా జిల్లా కన్వీనర్ చల్లా ఉమారాజమంగతాయారు, జేవీవీ గౌరవాధ్యక్షుడు దాడి పద్మనాభం, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.సూర్యనారాయణ మాట్లాడారు. గొల్లప్రోలులోని వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను, ఉద్యోగులను సత్కరించారు.

తాళ్లరేవు: తాళ్లరేవులో భీమాబాయి మహిళా మండలి అధ్యక్షురాలు వాసంశెట్టి నందివర్ధన ఆధ్వర్యంలో మహిళలు బైపాస్ నుంచి చెరువుగట్టు సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. డైరెక్టర్ వాసంశెట్టి కాన్సీ, న్యాయవాది మోహన్ జాన్సీ, సిబ్బంది రామయ్యశెట్టి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

కరప: పెనుగుదురులో జనసేన నేత రెడ్డిపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మండలాధ్యక్షుడు బండారు మురళి మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న జనసేన ఎంపీటీసీలు, వీరమహిళలు హాజరై కేక్ కట్ చేశారు. వారందరికీ శాలువాలు కప్పి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఎంపీటీసీలు పబ్బినీడి పద్మావతి, యండమూరి వీరవేణి, కె.ధనలక్ష్మి, జనసేన నాయకులు తూము బన్ను, బోగిరెడ్డి గంగాధర్, బోగిరెడ్డి కొండబాబు, గంటా నానిబాబు, ముమ్మిడి పుష్పలత, ముద్రగడ రమేష్, ముత్యాలరావు, మెండు గోవిందు పాల్గొన్నారు.


ఏలేశ్వరం: టీడీపీ ఆధ్వర్యంలో పట్టణంలో వెంగలరావు కాలనీలో 6వ వార్డు మహిళలు నిర్వహించిన కార్యక్రమానికి ప్రత్తిపాడు ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్‌చేసి పంచారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, కోనాల వెంకటరమణ, యండగుండి నాగబాబు, పెంద్ర శ్రీను, జిగటాపు సూరిబాబు, చందువోలు సాయితేజ, భజంతుల మణి, మామిడి మాధవి, మైనాల కనకారావు ఉన్నారు.

సామర్లకోట: సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో స్టేషన్ పరిధిలోని అన్ని విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగులను స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎస్ఎం.అనంతలక్ష్మి, ఆర్పీఎఫ్ ఎస్ఐ రామకృష్ణ, రైల్వే పోలీస్ ఎస్ఐ బొట్టా లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం: ఉలిమేశ్వరం, కాండ్రకోట గ్రామాల్లో కార్యక్రమాల్లో ఎంపీడీవో ఎం.ఉషారాణి మాట్లాడారు. ఈవోపీఆర్డీ కాగితాల రాజశేఖర్ పాల్గొన్నారు. పులిమేరులో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజ బాబు మాట్లాడారు. కుంచే అంజిబాబు, రత్నం, మణమ్మ తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక కోర్టు ఆవరణలో మహిళా న్యాయవాదులు మాదాల మంజూషా, పిల్లా సుధారాజేశ్వరి, మండల న్యాయ సేవాధికారి సంస్థ బాధ్యురాలు శ్రీలక్ష్మి, న్యాయవాద గుమస్తా దివ్య, విజయలక్ష్మిలను బార్ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చలంకూరి రామకృష్ణ, అధ్యక్షుడు చిట్టెంశెట్టి పులయ్య, కార్యదర్శి బొంగులూరు మధుబాబు, సీనియర్ న్యాయవాదులు పిల్లి బలరాముడు, రెడ్డం వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

సర్పవరం జంక్షన్: ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను సత్కరించారు. జి.కృష్ణమోహన్, ఉపాధ్యాయురాలు పర్వతిని శేషామాంబ, విజయలక్ష్మి, ఉషారాణి, అడబాల సత్యనారాయణ, బుద్ధరాజు సత్యనారాయణ పాల్గొన్నారు.



కాకినాడ సిటీ: నగదు ప్రోత్సాహకాల అందజేత



వైసీపీ రంగులతో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ బల్బులు

వైసీపీ రంగులతో సెంట్రల్ లైటింగ్!

పిఠాపురం, మార్చి 8: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రచారం కోసం దేనిని వదలడం లేదు వైసీపీ నేతలు. పిఠాపురంలోని ఉప్పాడ బస్టాండు నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకూ గల సెంట్రల్ లైటింగ్ నిర్వహణ నిమిత్తం నిధులు మంజూరయ్యాయి. వాటితో పనులు నిర్వహించిన మున్సిపల్ అధికారులు లైట్లు ఉన్న పోల్స్‌కు వైసీపీ జెండా రంగులను పోలిన ఎల్‌ఈడీ దీపాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి వాటిని వెలిగించగా ఇవన్నీ వైసీపీ ప్రచారంలా కనిపించడంతో పట్టణ ప్రజలు విస్మయానికి లోనయ్యారు. ప్రభుత్వ ఖర్చుతో నిర్వహించిన పనుల్లో వైసీపీ రంగులతో బల్బులు ఏర్పాటు చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

సచివాలయంలో వైసీపీ పెత్తనం!



కార్యదర్శి కుర్చీలో ఎమ్మెల్యే అనుచరుడు

శంఖవరం, మార్చి 8: శంఖవరం మండలంలో వైసీపీ ఎమ్మెల్యే అనుచరుల ఆగడాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. శంఖవరం సచివాలయం కార్యదర్శి కుర్చీలో కూర్చుని పెత్తనం సాగిస్తున్న ఎమ్మెల్యే అనుచరుడి వీడియో ఇప్పుడు నియోజకరవర్గంలో హల్‌చల్ చేస్తుంది. ఐదేళ్లపాటు సిబ్బందిని వైసీపీ నేతలు ఏ స్థాయిలో భయపెట్టారో ఈ వీడియోలో తేటతెల్లమవుతుంది. ఈ వీడియో జిల్లావ్యాప్తంగా హల్‌చల్ అవడంతో ఆయన తీరు విమర్శల పాలవుతుంది. దీనిపై ఎంపీడీవోను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

ముద్రగడను కలిసిన చంద్రబోస్

కిర్లంపూడి, మార్చి 8: వైసీపీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ కిర్లంపూడిలో శుక్రవారం మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం నివాసంలో ఆయన్ని కలిశారు. ఈ సందర్భంగా పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను విలేఖరులు ప్రశ్నించగా మద్రగడ వైసీపీలోకి రావడం జరుగుతుందని, ఆయన త్వరలోనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలుస్తారన్నారు.

'బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాకారం'

కాకినాడ సిటీ, మార్చి 8: బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాకారమవుతుందని, బీసీలకు నిధులు, విధులు లేని డమ్మీ కార్పొరేషన్ పదవులు ఇచ్చి వైసీపీ మోసం చేసిందని టీడీపీ బీసీ నేత వాసంశెట్టి సుభాష్ విమర్శించారు. కాకినాడలోని ఓ ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ బీసీ నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ టీడీపీ-జనసేన ఉమ్మడిగా నిర్వహించిన బీసీ జయహో సభలో చంద్రబాబు ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అంశాలను స్వాగతిస్తున్నామన్నారు. నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో బీసీల సమస్యల మీద అవగాహన కల్పించుకుని పలు అంశాలను డిక్లరేషన్‌లో పొందుపరిచారన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం, బీసీలకు 50 ఏళ్లకే రూ.4వేల పెన్షన్, స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్లు పునరు ద్ధరణ, బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.లక్షా50వేలకోట్ల నిధులు వినియోగం, ఆదరణ పథకాలు కొనసాగింపు ద్వారా బీసీలకు తిరిగి మంచి రోజులు రానున్నాయన్నారు. బీసీ సంఘాల నాయకులు పప్పు దుర్గా రమేష్, సుందరపల్లి గోపా లకృష్ణ, ఏవీడీ మెంటారావు, వొమ్మి బాలాజీ, కొక్కిరగడ్డ గంగరాజు, ఎంఎ తాజుద్దీన్, కె.సురేష్ ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, మార్చి 8: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి భద్రాచలానికి చెందిన పాకల దుర్గాప్రసాద్, లక్ష్మి దంపతులు శుక్రవారం రూ.1,01,116లు విరాళం ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆయన అభినందించి స్వామి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.



పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత